సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



పోటెత్తిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులు, పెళ్లి జనాలతో పోటెత్తింది. క్షేత్రంలోని అన్ని విభాగాలూ భక్తులతో కిటకిటలాడాయి. 8లో ▸



యూపీఐ సేవలు నిలిచిపోవడంతో..

యూపీఐ సేవలు నిలిచిపోవడంతో జిల్లావ్యాప్తంగా శనివారం వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. డిజిటల్ లావాదేవీలకు ఆటంకం కలిగింది. 8లో ▸



యువతి ఆత్మహత్య

ప్రేమించి మోసం చేయడంతో ఏలూరులో నర్సుగా పనిచేస్తున్న యువతి ఆత్మహత్య చేసుకుందని, న్యాయం చేయాలంటూ తల్లిదండ్రులు ధర్నా చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

పీఏసీ సభ్యులుగా చెరుకువాడ, వాసుబాబు



చెరుకువాడ శ్రీరంగనాథరాజు



పుప్పాల వాసుబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఇద్దరు కీలక నేతలకు చోటు దక్కింది. పీఏసీ పూర్తిస్థాయిలో పునః వ్యవస్థీకరించి నూతన నియామకాలు చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో నూతన సభ్యులను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి మాజీ మంత్రి, ఆచంట మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఏలూరు జిల్లా నుంచి ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాస్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది ముఖ్య నేతలతో కమిటీని ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాలోని పలువురు నాయకులకు స్థానం కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్టూడెంట్స్ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పి.సంజయ్‌బాబు, పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా తన్నీడి వెంకట గంగాధరరావు, రాష్ట్ర కార్యదర్శిగా వీఎస్ సీతారామకృష్ణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జీజీ బెన్‌హర్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటనలో తెలిపింది.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



భీమవరంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శనివారం పట్టణంలోని ప్రకాశం చౌక్‌లో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. భీమారావు మాట్లాడతూ వక్ఫ్ చట్టం దేశ ఐక్యతకు, మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతమని, ప్రతిపక్షాలు సూచించిన సవరణలను పరిగణనలోకి తీసుకోకుండా చట్టాన్ని ఆమోదించడం దురదృష్టకరమన్నారు. ముస్లిం మైనార్టీ నాయకులు చాన్ బాషా, షేక్ ఆషా, అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్, కార్యదర్శి వి.రాజు, సీపీఐ నాయకులు చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మద్యం



వినతిపత్రం అందిస్తున్న కల్లు గీత నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో మద్యం సిండికేట్లకు లాభాల కోసం ఊరూవాడా బెల్టుషాపులు పెట్టుకోమని కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టుందని, దీంతో ఎక్సైజ్ అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదని కల్లు గీత కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి విమర్శించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్లు గీత కార్మిక సంఘం నాయకులు మోకులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. నర్సింహమూర్తి మాట్లాడుతూ బెల్టు షాపులతో కల్లు గీత కార్మికులు వ్యాపారాలు లేక రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. బెల్టు షాపులను అరికట్టాలని, గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 5 వేలు, రాష్ట్రంలో 70 వేల వరకు బెల్టుషాపులు ఉన్నాయన్నారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెర వేర్చాలన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు బొక్కా చంటి, బొంతు శ్రీను, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రొయ్యకు సిండికాటు

ఇదేందిరొయ్యో

- రైతులను దోచేస్తున్న వ్యాపారులు
- అమెరికా సుంకాల పేరిట భారీగా ధరల తగ్గింపు
- కిలోకు కౌంట్‌ను బట్టి రూ.50 నుంచి రూ.90 వరకు కోత
- ఇప్పట్లో సుంకాలు లేవంటున్న అగ్రరాజ్యం
- అయినా ధరలు పెంచని వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



రొయ్యలను ఎగుమతి చేస్తున్న దృశ్యం (ఫైల్)

భీమవరం: రొయ్య రైతుల కష్టాన్ని ఆక్వా సిండికేట్ అడ్డగోలుగా దోచేస్తోంది. అమెరికా సుంకాలు పెంచేసిందంటూ పది రోజుల క్రితం ఎక్స్‌పోర్టర్స్, ప్రాసెసింగ్ ప్లాంట్లు, మీడియేటర్స్ క్షణాల్లో రొయ్య ధరలను అమాంతం తగ్గించేశారు. మూడు నెలల పాటు పన్నుల పెంపు లేదని అమెరికా స్పష్టం చేసినా తగ్గించిన ధరలు పెంచకుండా రైతుల కష్టాన్ని కొల్లగొడుతున్నారు.

జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో..

జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా దీనిలో వనామీ విస్తీర్ణం 70 వేల వరకు ఉంటుంది. దాదాపు 30 వేల మందికి పైగా రైతులు రొయ్యల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడం వలన రొయ్యల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లో పెద్ద మొత్తంలో రొయ్యలు మార్కెట్‌లోకి వస్తుంటాయి. ఏటా సీజన్‌లో సుమారు 500 టన్నుల వరకు రొయ్యలు అమెరికా, చైనా, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఒడిదుడుకుల కోర్చి రైతులు పండించిన పంటను ఎగుమతిదారులు, ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యాజమాన్యాలు, మధ్యవర్తులు ఏకమై కొల్లగొడుతున్నారు.

టారిఫ్‌లు సాకుగా..

నెల రోజుల క్రితం 100 కౌంట్ రొయ్యల ధర కిలో రూ.260 వరకు ఉండగా మార్కెట్‌లోకి రొయ్యలు ఎక్కువగా వస్తుండటంతో రూ.230కి తగ్గించేశారు. జిల్లావ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలపడంతో రూ.240కి పెంచిన విషయం తెలిసిందే. దేశీయ ఉత్పత్తులపై సుంకాలను 26 శాతం పెంచుతున్నట్టు ఈనెల 3న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడాన్ని సాకుగా చూపించి మరలా ధరలు తగ్గించేశారు. కిలోకు 50 కౌంట్‌లోపు రొయ్యలు మాత్రమే అమెరికాకు ఎగుమతి అవుతుండగా.. 60 కౌంట్ నుంచి 100 కౌంట్ వరకు చైనా, యూరప్ దేశాలకు వెళుతుంటాయి. అమెరికా పన్నుల ప్రభావమంటూ అన్ని కౌంట్లలోనూ రూ.50 నుంచి రూ.90 తగ్గించేసి కొనుగోళ్లు చేయడంతో రైతులు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పైగా నష్టపోవాల్సి వచ్చింది.

కిలో రూ.100 వరకు ధరలు తగ్గించి..

గత 10 రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రొయ్యలపై దిగుమతి సుంకం 26 శాతం పెంచుతున్నట్టు ప్రకటించిన వెంటనే ఇక్కడ ఎగుమతిదారులు రూ.50 నుంచి రూ.100 వరకు ధరలు తగ్గించేశారు. వివిధ దేశాధినేతల ఒత్తిడి మేరకు మళ్లీ ట్రంప్ ఇప్పట్లో సుంకాలు పెంచబోమని ప్రకటించినా ఇక్కడి ఎగుమతిదారులు ధరలు పెంచకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెట్టుబడులు పెట్టలేక.. పట్టుబడులు పట్టలేక..

వారం రోజులుగా రొయ్య ధరలు తగ్గిపోవడంతో మళ్లీ పెరుగుతాయని భావించి రైతులు తమ చెరువుల్లోని రొయ్యలు పట్టుబడులు చేయకుండా నిరీక్షిస్తున్నారు. దీంతో రోజుకు పెద్ద మొత్తంలో ఫీడ్, ఇతర మందులకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోరాటాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం

ఈనెల 9న ఉండిలో అప్పడా వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నిర్వహించే సమావేశాన్ని కూటమి నేతలు అడ్డుకున్నారు. రొయ్య రైతులు రోడ్డెక్కితే ప్రభుత్వ పరువు, ప్రతిష్టలు అభాసుపాలవుతాయని తలచి అసోసియేషన్ నాయకులను, రైతులను కూటమి నాయకులు బుజ్జగించే ప్రయత్నంలో ఉన్నారు. మళ్లీ ఆదివారం ఉండిలో కోట్ల ఫంక్షన్ హాలులో రైతుల సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమయ్యారు. అయితే ఈ సమావేశంలో రైతులు రొయ్యల ధరల గురించి మాట్లాడకుండా ఫీడ్ ధరలు, విద్యుత్ సబ్సిడీ వంటి అంశాలు మాత్రమే ప్రస్తావించేలా పథకం రచించినట్టు తెలిసింది. కూటమి నాయకుల కనుసన్నల్లో నిర్వహించే ఆక్వా రైతుల సమావేశం వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని పలువురు పెదవి విరుస్తున్నారు.

ధరలు నిలకడగా ఉండేలా చూడాలి



రొయ్యల ధరల పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. అమెరికా పన్నుల పేరుతో ఆ దేశానికి ఎగుమతి కాని కౌంట్ రొయ్యలకు కూడా దళారులు ధర తగ్గించి రైతులను నష్టాల ఊబిలోకి తోస్తున్నారు. దీనిపై ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు కాకుండా రొయ్యల ధరలు నిలకడగా ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– పెనుమాల నర్సింహస్వామి, ఆక్వా రైతు, గొల్లవానితిప్ప

దళారుల రాజ్యం

రొయ్యల సాగులో ఎకరాకు రూ.4 లక్షలకు పైగా పెట్టుబడులు అవుతున్నాయి. రైతుల వద్ద నుంచి పట్టుబడి రొయ్యలు ఎగుమతిదారులు వద్దకు చేరుకోవడానికి ముగ్గురు మధ్యవర్తులను దాటి వెళ్లాల్సి వస్తుంది. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారుల వద్ద ఏవైతే రొయ్య కొరతలు ఉన్నాయో వాటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులకు సమాచారం పంపుతారు. ఉదాహరణకు ఎగుమతులుదారుల వద్ద 100 కౌంట్ కిలో రూ.235 ధర ఉంటే వ్యాపారుల నుంచి ప్రాసెసింగ్ యూనిట్లు రూ.220 కొనుగోలు చేస్తాయి. వీళ్లు 5 టన్నులకు పైగా ఉంటేనే కొంటారు. అయితే వ్యాపారులు మాత్రం రైతుల వద్ద నుంచి రూ.190కి మాత్రమే కొనుగోలు చేస్తారు. దీంతో రైతులు టన్నుకు రూ.45 వేల వరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం కల్పించుకుని ధాన్యం మాదిరిగా రొయ్యలను కొనుగోలు చేయాలి. రొయ్యల కొనుగోలులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించాలి.

మొక్కుబడి సమావేశాలు వృథా



కూటమి నాయకులు రైతులతో మొక్కుబడి సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. వారం రోజులుగా రొయ్యల ధరలు భారీగా పతనమై రైతులు నష్టపోతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణం. రైతులు, రొయ్యల కొనుగోలుదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటుచేయాలి.

– నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, ఆక్వా రైతు, కొణితివాడ

'సాక్షి'పై అక్రమ కేసులు ఎత్తివేయాలి



భీమవరం: డీఎస్పీ జయసూర్యకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



తాడేపల్లిగూడెం: డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

గళమెత్తిన పాత్రికేయులు

భీమవరం: పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన హత్యకు సంబంధించి 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు ఆరుగురు పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడంపై రెండో రోజూ శనివారం జిల్లాలో పాత్రికేయులు గళమెత్తారు. భీమవరంలో ఏపీయూడబ్ల్యూజే, భీమవరం ఏరియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీ ఆర్‌జీ జయసూర్యకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా, రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రంశెట్టి గిరిజాపతి మాట్లాడుతూ అక్రమ కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కమ్మిల హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ఆర్‌కే గోపాలకృష్ణ, పాత్రికేయులు పి.విజయ్‌కుమార్, ఎ.శ్రీనివాస్, రవి, ఎన్.నాగరాజు, ఎన్.సత్యనారాయణ, రాజాబాబు, వీపీవీ అప్పయ్య, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో గళమెత్తి..

తాడేపల్లిగూడెం: ఏపీయూడబ్ల్యూజే, తాడేపల్లిగూడెం ఏరియా ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద పాత్రికేయులు నిరసన తెలిపారు. ఐజేయూ (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్) కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ 'సాక్షి' సంపాదకులపై కేసు నమోదు కక్ష సాధింపు చర్యగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం, పోలీసులు కలిసి రాజకీయ ద్వేషాలను జర్నలిస్టుల మీద చూపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఏపీయుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి గజపతి ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టి.రంగసురేష్, యూనియన్ రాష్ట్ర నాయకుడు యడ్లపల్లి మురళీకృష్ణ, ప్రెస్ క్లబ్ సభ్యులు పాలడుగు సతీష్, పెద్దోజు మురళీ, పుండరీ, కె.వెంకట్రావు, కళింగ లక్ష్మణరావు, కె.ఆశీర్వాదరావు, కేవీ కృష్ణారావు, శీలి రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

దిగజారిన స్థానం

- ఇంటర్ ఫలితాల్లో ఏలూరు జిల్లా వెనుకంజ
- ఫస్టియర్‌లో 6 నుంచి 10కి..
- సెకండియర్‌లో 8 నుంచి 9కి తగ్గిన స్థానం
- ప్రథమ సంవత్సరంలో 70.43 శాతం
- ద్వితీయ సంవత్సరంలో 84.66 శాతం ఉత్తీర్ణత



ఏలూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు చూసుకుంటున్న విద్యార్థినులు

ఇంటర్ ప్రథమ సంవత్సరం	
జనరల్ విద్యార్థులు	15,288
ఉత్తీర్ణులు	10,842
ఒకేషనల్ విద్యార్థులు	1,880
ఉత్తీర్ణులు	1,250

ఇంటర్ ద్వితీయ సంవత్సరం	
జనరల్ విద్యార్థులు	12,086
ఉత్తీర్ణులు	10,376
ఒకేషనల్ విద్యార్థులు	1,417
ఉత్తీర్ణులు	1,056

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఏలూరు జిల్లా పతనం దిశగా సాగుతోంది. గతంలో రాష్ట్రస్థాయిలో మెరుగైన స్థానాల్లో నిలవగా.. గతేడాది నిరుత్సాహపరిచింది. అయితే ఈ ఏడాది మరింత దిగజారింది. 2021–22లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పరీక్షలు జరగ్గా రాష్ట్రస్థాయిలో 5వ స్థానం, 2022–23లో ఫస్టియర్‌లో 2వ స్థానం, సెకండియర్‌లో 3వ స్థానంలో జిల్లా నిలిచింది. 2023–24లో ఫస్టియర్‌లో 6, సెకండియర్‌లో 8వ స్థానంలో సరిపెట్టుకుంది. ఈ ఏడాది (2024–25)లో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 10వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 9వ స్థానానికి పడిపోయింది. ఏటా మాదిరిగా బాలురుపై బాలికలు తమ హవా కొనసాగించారు.

ఫస్టియర్‌లో..

జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17,168 మంది పరీక్షలు రాయగా 70.43 శాతంతో 12,092 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎయిడెడ్ విద్యార్థులు 363 మందికి 161 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 502 మందికి 454 మంది, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు 305 మందికి 201 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 1,744 మందికి 900 మంది, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 409 మందికి 139 మంది, కస్తూరిబా బాలికా విద్యాలయ విద్యార్థులు 57 మందికి 36 మంది, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులు 13,788 మందికి 10,201 మంది ఉత్తీర్ణులయ్యారు.

సెకండియర్‌లో.. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13,503 మంది పరీక్షలు రాయగా 84.66 శాతంతో 11,432 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎయిడెడ్ విద్యార్థులు 256 మందికి 191 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 421 మందికి 402 మంది, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు 288 మందికి 228 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 1,153 మందికి 868 మంది, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 171 మందికి 114 మంది, కస్తూరిబా బాలికా విద్యాలయ విద్యార్థులు 45 మందికి 36 మంది, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులు 11,169 మందికి గాను 9,593 మంది ఉత్తీర్ణులయ్యారు.

బాలికలదే హవా : బాలికలు మరోసారి సత్తా చాటారు. ఫస్టియర్‌లో 6,676 మంది బాలికలు, 4,166 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 6,016 బాలికలు, 4,360 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థుల్లో బాలికలు 889 మంది, బాలురు 361 మంది, ద్వితీయ సంవత్సరంలో బాలికలు 838 మంది, బాలురు 353 మంది పాస్ అయ్యారు.

15 నుంచి సప్లిమెంటరీకి దరఖాస్తులు

ఫెయిలైన విద్యార్థులు ఈనెల 15 నుంచి సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు. ఈనెల 22 వరకు గడువు ఉందన్నారు. అలాగే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 13 నుంచి 22 వరకూ సంబంధిత కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ మే 28 నుంచి జూన్ 4 వరకు, థియరీ పరీక్షలు మే 12 నుంచి 20 వరకూ జరుగుతాయన్నారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు



గొల్లవానితిప్పలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మండలంలోని గొల్లవానితిప్పలో శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుతో, వెంపలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి ఆయన అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ అన్నివర్గాలకు అనుకూలంగా రాజ్యాంగాన్ని రచించారన్నారు. అంబేడ్కర్ మన దేశంలో పుట్టడం దేశ ప్రజల అదృష్టమన్నారు. పీఏసీ చైర్మన్ రామాంజనేయులు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా మెలిగే అందరికీ రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, నాయకులు మెంటే పార్థసారథి, వబిలిశెట్టి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, మాజీ సర్పంచ్ బోకూరి విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ధ్వజం

వీరవాసరం: ఆక్వా రైతులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్ ధ్వజమెత్తారు. మండలంలోని నౌడూరు జంక్షన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్వా రైతులు ఉద్యమ బాట పట్టడంతో విధిలేని పరిస్థితిలో ఫీడ్ కంపెనీలు కాస్తంత దిగొచ్చేయి అన్నారు. రాష్ట్రంలో పది నెలలుగా అడ్డగోలు దోపిడీ అనంతరం కంటి తుడుపు చర్యగా కిలోకు ఫీడ్ ధర రూ.4 చొప్పున తగ్గించామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది తగ్గించిన, రద్దు చేసిన దిగుమతి సుంకం ఆధారంగా కనీసం కిలోకు రూ.25 నుంచి రూ.35 ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. అమెరికా ప్రభుత్వం ప్రతీకార సుంకం విధించిన నేపథ్యంలో ఆఘమేఘాల మీద అమెరికాకు ఎగుమతులు చేయని కౌంటు రొయ్యల ధరలను సైతం ఇష్టానుసారం తగ్గించి రైతులను నిలువునా దోపిడీ చేశారని విమర్శించారు. ట్రంప్ ప్రభుత్వం 90 రోజులపాటు సుంకాలను నిలుపుదల చేస్తామని ప్రకటించినా ఇప్పటికీ తగ్గిన రొయ్యల ధరలను పెంచిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. రొయ్యల హేచరీలు, రొయ్యల ఫీడ్ ఫ్యాక్టరీలు, రొయ్యల ఎగుమతిదారులు ఒక్కరే కావడంతో పాటు సిండికేట్‌గా మారి ఆక్వా రైతులను నట్టేట ముంచేస్తూ ఆర్థిక నష్టాల బారిన పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రొయ్యల రైతులకు ఏ మాత్రం కష్టం వచ్చినా తక్షణం స్పందించేవారని గుర్తుచేశారు. రొయ్యల రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకుని నష్టాలబారి నుంచి తప్పించాలని ఎమ్మెల్సీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఆక్వా ఫీడ్ ధరలు మరింత తగ్గించాలి

ఆక్వా సంఘ అధ్యక్షుడు గాంధీ భగవాన్‌రాజు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతులు వదిలిన క్రాప్ హాలిడే బాణానికి ఫీడ్ కంపెనీలు దిగి వస్తున్నాయని, అయినా వారు ఇచ్చిన ఆఫర్ ఆమోదయోగ్యంగా లేదని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. శనివారం స్థానిక ఆక్వా రైతు సంఘం భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీడ్ తయారీ ముడి సరుకుల ధరలు వందల్లో తగ్గితే ఫీడ్ ధరలను కంపెనీలు పైసల్లో తగ్గిస్తామంటూ సంకేతాలు పంపిస్తున్నాయని అన్నారు. ఫీడ్ ధరలు రూ.4 తగ్గిస్తామని అంటున్నారని, అయితే కిలోకు రూ.25 తగ్గించాలని డిమాండ్ చేశారు. కనీసం రూ.20 ధర తగ్గితేనే రైతులకు ఊరటగా ఉంటుందని, లేకుంటే ఊరుకోబోమన్నారు. అమెరికా సుంకాల పేరుతో 100 కౌంట్ రొయ్యల ధరలను ప్రాసెసింగ్ యూనిట్లు తగ్గించాయని, అయితే అగ్రరాజ్యం సుంకాల విధింపునకు 90 రోజులు గడువు ఇచ్చినా ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్లు రొయ్యల ధరలను పెంచడం లేదన్నారు. ఆక్వా రైతుల కష్టాలపై కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడుకి వినతిపత్రం ఇచ్చామని, తాము ముందుగా రైతులమని ఆ తర్వాతే రాజకీయాలను అన్నారు. ఆదివారం భీమవరంలో జిల్లా ఆక్వా రైతు సమావేశం ఏర్పాటుచేస్తున్నామని, ఆక్వా రైతులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఫీడ్ ధరలు తగ్గించేలా ప్రాసెసింగ్ యూనిట్‌లు, రొయ్య కౌంట్ ధరలు పెంచేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘ సెక్రటరీ బోణం చినబాబు, మేడిది జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 35తో ఉద్యోగులకు తీరని నష్టం

ఏలూరు(మెట్రో): పంచాయతీరాజ్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన జీఓ 35 వల్ల తీరని నష్టం జరుగుతుందని పంచాయతీరాజ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు తెలిపారు. జీఓతో ఏఓ పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఎంపీడీఓ పోస్టు నేరుగా నియామకం రద్దు చేయడం వల్ల అదనంగా వచ్చిన 30 శాతం కోటాలో తమకు కనీసం 50 శాతం కూడా పెంచకపోవడం దారుణమన్నారు. తక్షణమే జీఓ 35ను సవరణ చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పోటెత్తిన శ్రీవారి క్షేత్రం



కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులు, పెళ్లి జనాలతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ విద్యార్థులకు సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం క్షేత్రంలోను, వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వివాహాలు జరగడంతో నూతన వధువరులు, వారి బంధువులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులు, పెళ్లి జనాలతో కిటకిటలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు రద్దీగా మారాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో ఈ రద్దీ కొనసాగింది. ఆదివారం క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అసభ్యకర ప్రవర్తనపై కేసు నమోదు

భీమవరం: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ ఎస్సై రెహమాన్ శనివారం చెప్పారు. రాయలం గ్రామంలో ఉంటున్న కొక్కిట్టి రాములు తన భర్త చనిపోవడంతో ఇళ్లలో పని చేసుకుని జీవిస్తోంది. ఈనెల 11న ఇళ్లలో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన కుమార్, అతని స్నేహితుడు ఆమెను అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించారు. రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

యూపీఐ సేవలు నిలిచిపోవడంతో గగ్గోలు

ఏలూరు (టూటౌన్): యూపీఐ సేవలు నిలిచిపోవడంతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా శనివారం వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే డౌన్ అవడంతో సేవలు అందుబాటులో లేవు. దీంతో డిజిటల్ లావాదేవీలు నిలిచిపోవడంతో చాలాచోట్ల యూజర్లు పేమెంట్లు చేయలేకపోయారు.


స్థానిక ఎస్ఆర్‌పేటలోని ఒక బిర్యానీ హోటల్‌కు వచ్చిన ఇద్దరు యువకులు బిర్యానీ తిన్నాక ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లిద్దామంటే స్కానర్ పనిచేయలేదు. క్యాష్ ఇద్దామంటే జేబులో సరిపడా సొమ్ములు లేవు. దీంతో ఫోన్‌తో చాలా సేపు కుస్తీ పట్టిన సదరు యువకులు బిక్క మొహం వేశారు. చివరకు అందులోని ఒక యువకుడి సోదరుడికి ఫోన్ చేసి రమ్మని డబ్బులు కట్టారు.

స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని ఒక వస్త్ర దుకాణంలోకి వచ్చిన మహిళ తనకు నచ్చిన దుస్తులు కొనుగోలు చేసింది. క్యాష్ కౌంటర్‌కు వచ్చి డిజిటల్ పేమెంట్ చేసేందుకు ప్రయత్నించగా యూపీఐ సర్వర్ స్లోగా ఉండటంతో మనీ ట్రాన్స్‌ఫర్ అయినట్లు చూపినా అవి దుకాణదారుడి ఖాతాలోకి రాలేదు. దీంతో ఆమె ఇంటి నుంచి కుటుంబ సభ్యులను రప్పించి నేరుగా క్యాష్ చెల్లించాల్సి వచ్చింది.



పనిచేయని యూపీఐ స్కానర్లు

ఇలాంటి సన్నివేశాలు శనివారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల దర్శనమిచ్చాయి. ఒక్కసారిగా డిజిటల్ లావాదేవీలు డౌన్ అయితే పరిస్థితి ఏంటనే దానిపై శనివారం జిల్లా వాసులకు స్పష్టత వచ్చింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)లో శనివారం టెక్నికల్ ప్రాబ్లం రావడంతో డిజిటల్ పేమెంట్స్ నిలిచిపోయాయి. జిల్లాలో చాలా మంది వినియోగదారులు డిజిటల్ చెల్లింపులకు వీలు కావడం లేదని ఫిర్యాదులు చేశారు. పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే డిజిటల్ పేమెంట్ యాప్‌లు పనిచేయడం లేదని వినియోగదారులు గగ్గోలు పెట్టడం కన్పించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో 66 శాతం యూజర్లకు పేమెంట్ చేసే సమయంలో సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. మరో 34 శాతం మంది ఫండ్ ట్రాన్స్‌ఫర్ కావడం లేదని రిపోర్ట్ చేశారు.



ఎర్రర్ చూపుతున్న ఫోన్‌పే

జిల్లాలో 10 లక్షలకు పైగా వినియోగదారులు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 లక్షల వరకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. వీరిలో 10 లక్షల మంది వరకు డిజిటల్ లావాదేవీలైన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి వాటిని వినియోగిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో కనీసం రూ.10 కూడా డిజిటల్ పేమెంట్ చేస్తున్నారు. దీంతో జేబులో, పర్సులో డబ్బులు లేకుండానే యూపీఐ చెల్లింపులు చేస్తున్నారు. వరుసగా బ్యాంకులకు మూడు రోజులు సెలవులు రావడం, శనివారం మధ్యాహ్నం నుంచి డిజిటల్ సేవలు మొరాయించడంతో ప్రజలకు తమ వెంట నగదు తెచ్చుకోకపోతే పరిస్థితి ఏంటనేది అర్థమైంది.

నిట్ డైరెక్టర్‌కు ఉగాది పురస్కారం



తెలంగాణ గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వీ రమణరావు కిన్నెర ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ విషయాన్ని నిట్ అధికారులు శనివారం తెలిపారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు న్యాయ, పోలీసు, రక్షణ, ఇంజనీరింగ్, సాహిత్యం ,వైద్యం, నాటకం, నృత్యం, సంగీతం, ప్రసార మాధ్యమం, చిత్రలేఖనం, హస్తకళలు వంటి పలు రంగాల్లో విశేష సేవలందించిన వారిని ఏటా గుర్తించి అవార్డులతో సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాదికి సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్యులు రమణారావును ఎంపిక చేశారు. ఇటీవల హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణా గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

కోకో రైతుల ధర్నా



తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం ఆర్ఎస్‌కే వద్ద ధర్నా చేస్తున్న కోకో రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: కోకో పంటకు అంతర్జాతీయ మార్కెట్‌కనుగుణంగా ధర చెల్లించాలని కోరుతూ శనివారం మండలంలోని నీలాద్రిపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ల వెంకట సుబ్బారావు (సబ్బి) మాట్లాడుతూ ఇంటర్నేషనల్ మార్కెట్‌లో కిలో కోకోకు రూ.700 ధర ఉందన్నారు. కొంతమంది వ్యాపారులు కుమ్మక్కై కిలోకు రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, స్థానిక రైతులకు ఇంటర్నేషనల్ మార్కెట్ ప్రకారం రూ.700 చెల్లించి కొనుగోలు చేయడానికి ట్రేడర్లు ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వమే శ్రద్ధ తీసుకొని ఇంటర్నేషనల్ మార్కెట్ ప్రకారం రైతుల నుంచి కిలో రూ.700 చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. మద్దతు ధర సాధించే వరకు దశల వారీ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కోకో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెలమాటి విశ్వేశ్వరరావు, వట్టికూటి రమేష్‌బాబు, ఎస్ఆర్‌కేజీ. చౌదరి, వెలమాటి బుల్లి కృష్ణారావు, చేకూరి భాస్కరరావు, పోలిన సత్యనారాయణ, వెలమాటి సత్యనారాయణ, నీరుకొండ వెంకటరామారావు, కొడవటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించడం వల్లే ఆత్మహత్య

జీజీహెచ్ ముందు యువతి తల్లిదండ్రుల ధర్నా

ఏలూరు టౌన్/ముసునూరు : ఏలూరులోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తోన్న యువతిని ప్రేమించి మోసం చేయటంతో ఆత్మహత్య చేసుకుందని.. ఆమె మృతికి కారణమైన వ్యక్తిని శిక్షించి తమకు న్యాయం చేయాలంటూ ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు పురుగు మందు డబ్బాతో ధర్నాకు దిగారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేసి తమ కుమార్తె మరణానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పంతంగి నాగరాజు, రమాదేవికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె పంతంగి ఉమాశిరీష (23) బీఎస్సీ నర్సింగ్ చదివి ప్రస్తుతం ఏలూరు నగరంలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తోంది.



జీజీహెచ్ ముందు పురుగుల మందు డబ్బాతో ధర్నా చేస్తున్న నాగరాజు, రమాదేవి

నాగరాజు గ్రామంలో పంచాయతీ వాటర్‌వర్క్స్‌లో పనిచేస్తున్నారు. ఉమా శిరీష విజయవాడలోని హెల్ప్ హాస్పిటల్‌లో పనిచేస్తుండగా.. ముసునూరు మండలం విస్సన్నపేట ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ అదే హాస్పిటల్‌లో పనిచేసేవాడు. వారిద్దరూ ప్రేమించుకున్నారు. వారి ప్రేమను కుటుంబ సభ్యులు నిరాకరించారని చెబుతుండగా, యువతి తల్లిదండ్రులు మాత్రం తమ కుమార్తెను మోసం చేయటంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తున్నారు. శుక్రవారం స్వగ్రామంలో శిరీష పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శిరీష శనివారం మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు ఏలూరు జీజీహెచ్ వద్ద ఆందోళనకు దిగటంతో వెంటనే స్పందించిన పోలీస్ అధికారులు బాధితుల వద్దకు వెళ్లి వివరాలు తీసుకున్నారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ సంఘటనపై ఆరా తీశారు. స్టేట్‌మెంట్ తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో తమ కుమార్తెను బీఎస్సీ నర్సింగ్ చదివించామని.. ప్రేమ పేరుతో మోసం చేయటంతో ఆమె జీవితం అర్థాంతరంగా ముగిసిపోయిందని తల్లిదండ్రులు విలపించటం అందరినీ కలిచివేసింది.

క్షీరారామలింగేశ్వరస్వామికి చక్రస్నానం

27 మంది దంపతులతో కావిళ్లు సమర్పణ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివార్లకు చక్రస్నానం, త్రిశూల స్నానం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మిగతా ఆలయంలో చక్ర స్నానం, త్రిశూల స్నానంలో ఏదొకటి జరుగుతుందని.. పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాత్రం రెండూ జరుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు సన్నిధిరాజు కిష్టప్ప తెలిపారు. భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులు చక్ర, త్రిశూల స్నానాల్లో పాల్గొన్నారు. అనంతరం పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఈ హోమంలో 12 మంది దంపతులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 27 మంది దంపతులతో స్వామి, అమ్మవార్లకు 27 కావిళ్లతో సారె సమర్పించారు. ముందుగా ఆలయం నుంచి బయలుదేరి మెయిన్‌రోడ్డు, ముచ్చర్ల వారి వీధి, కారుమూరి వారి వీధి గుండా గొడుగు కావిళ్లతో ఊరేగి అనంతరం స్వామివారికి సమర్పించారు. పురుషులు కావిళ్లు మోయగా, మహిళలు భర్తలకు గొడుగులు పట్టుకుని సంప్రదాయబద్ధంగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరిండెంట్ వాసు, అర్చకులు అనిల్, వీరబాబు, పూర్ణయ్య, కె.వి కృష్ణవర్మ, మీసాల రాము, జక్కంపూడి కుమార్, మురహరి ఈశ్వరరావు, బోణం మునసబు తదితరులు పాల్గొన్నారు.



27 మంది దంపతులతో గొడుగు కావిళ్లతో సారె ఊరేగింపు

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్ ఏడో రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపించడంతో ఆ ప్రాంతంలోని వారంతా భయాందోళనకు గురయ్యారు. అపార్ట్‌మెంట్‌లో ఏం జరుగుతుందో అర్థంకాక జనం కిందికి పరుగులు తీశారు. అపార్ట్‌మెంట్‌లోని ఫోర్‌బీ ఫ్లాట్‌లో మంటలు చెలరేగటం, మరోవైపు దట్టమైన పొగతో 5వ అంతస్తులోని వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అవుతూ బయటకు రాలేక తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. అప్పటికే ఫ్లాట్‌లోని వస్తువులు, విలువైన సామాగ్రి కాలి బూడిదయ్యాయి. బాధితులను అగ్నిమాపక శాఖ సిబ్బంది సాహసోపేతంగా సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ రత్నబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శాంతినగర్ ఏడో రోడ్డు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పక్కన హిమనీ అపార్ట్‌మెంట్స్ ఉంది. శనివారం ఉదయం ఫోర్త్ బీ ఫ్లాట్‌లోని టీవీ ప్యానెల్ బోర్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు బెడ్‌రూమ్, హాలు, కిచెన్‌లోకి వ్యాపించాయి. ఆ సమయంలో ఫ్లాట్ యజమాని శ్రీకాంత్, కుటుంబ సభ్యులు ఇంట్లో లేదు. దట్టమైన పొగతో కారిడార్, మెట్ల ప్రాంతం పొగ కమ్మేసింది. 5వ అంతస్తులోని వృద్ధులు పీ.రామకృష్ణ (74), ఎస్.విజయలక్ష్మి (82) బయటకు రాలేక చిక్కుకుపోయారు. అగ్నిమాపక సిబ్బంది వారిని చేతులపై ఎత్తుకుని కిందికి తీసుకువచ్చారు. మంటలను అగ్నిమాపక సిబ్బంది గంటకు పైగా శ్రమించి అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.15 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది సేవలను అపార్ట్‌మెంట్ వాసులు అభినందించారు.



ఏలూరు శాంతినగర్ అగ్నిప్రమాదంలో ఫ్లాట్‌లో కాలిబూడిదైన సామగ్రి

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

చాట్రాయి: మనస్తాపంతో ఉరేసుకుని విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలోని చాట్రాయి గ్రామానికి చెందిన మరీదు ప్రవల్లిక(20) తరుచూ ఫోన్ చూస్తుందని తల్లిదండ్రులు శుక్రవారం మందలించారు. శనివారం ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లగా మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట వికాస్ కాలేజీలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతుంది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో అధికారిణి

యలమంచిలి: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మండల స్థాయి మహిళా అధికారి చిక్కుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పది రోజుల క్రితం ఉన్నతాధికారి పేరుతో బెదిరించడంతో ఆమె ఆన్‌లైన్‌లో రూ.70 వేలు వేసినట్లు సమాచారం. సైబర్ నేరగాళ్ల పని అని గ్రహించిన ఆమె పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోనికి తీసుకున్నట్లు తెలిసింది.

15 ఏళ్లుగా పోలీసుల కళ్లుగప్పి..

ఏలూరు టౌన్: విజయవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు 15 ఏళ్ళ క్రితం పోలీసులను మోసం చేసేందుకు ప్రయత్నించటంతో వారిని అరెస్ట్ చేయగా.. న్యాయస్థానం అప్పట్లో బెయిల్ మంజూరు చేసింది. అప్పటి నుంచి నుంచి కోర్టు వాయిదాలకు రాకుండా పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతోన్న ఒక వ్యక్తిని ఏలూరు ఐడీ పార్టీ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. 2010లో ఏలూరు డీఐజీగా మహేష్ భగవత్ వద్దకు జవ్వాది లక్ష్మీచెందు, చిన్న నాయుడు వచ్చి తాము దివంగత వైఎస్సార్ బంధువులమని.. ఒక ఎస్సైకు తణుకు పోలీస్‌స్టేషన్‌కు పోస్టింగ్ ఇవ్వాలని ఒత్తిడి చేశారు. అనుమానం వచ్చిన డీఐజీ ఆరా తీయగా, నకిలీ వ్యక్తులుగా గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. బెయిల్‌పై విడుదల అయ్యాక జవ్వాది లక్ష్మీచెందు వాయిదాలకు గైర్హాజరవుతున్నాడు.

ఇంటర్ ఫలితాల్లో 'శశి' సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న శశి వైస్ చైర్మన్ లక్ష్మీ సుప్రియ

ఉండ్రాజవరం: ఇంటర్-2025 ఫలితాలలో వేలివెన్ను శశి క్యాంపస్ విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారని విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.సాత్విక్ వర్మ, బి.షన్మిత, డీపీబీ బంగారం 990, ఎస్‌జేఎం దీపిక, బి.స్నేహ, జిఎస్.వైష్ణవి, కె.నంద కార్తిక్ 989 మార్కులు, ఏజేఎస్ రమాదేవి, ఎస్.హేమలత, పీఎల్ ప్రసన్న, సీహెచ్.పవన్‌కుమార్, ఎస్.రేఖ 988 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో కె.లీలా వినోదిని 990, జి.చెరిష్ సాయి, పి.ధరణి 989, టి.కీర్తి 988 మార్కులు సాధించారు. 990 మార్కుల పైన నలుగురు, 980 మార్కుల పైగా 179 మంది, 950 మార్కులపైగా 811 మంది, 900 మార్కులపైగా 1402 మంది సాధించారని ఆయన తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్.నాగపూజిత్, వై.రాహుల్, టి.నారాయణ మూర్తి, ఎం.శైలజ, పి.సాయి చరణ్, సీహెచ్.వినీల, కె.కాశీశ్వర, టి.మణికంఠ, ఎం.సాయిలక్ష్మి, బి.సాత్విక్, ఎస్‌వి.తేజశ్విని, సయ్యద్ అనస్, ఎన్.చాతుర్ వర్మ, యు.ధీరజ్ కుమార్, ఎండి.తహలీల్ సామా 466 మార్కులు, బైపీసీలో ఎల్.దినేష్, జి.భవ్య, ఎస్.స్వర్ణాంజలి, పి.సుష్మ 435 మార్కులు సాధించారు. 465 మార్కులు పైన 50 మంది, 460 మార్కుల పైన 264 మంది, 430 మార్కులు పైన 1070 మంది, 400 మార్కుల పైన 1567 మంది సాధించారని ఆయన తెలిపారు. ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో మాంటిస్సోరి ప్రతిభ



ఎ.లావణ్య, పీఎస్‌వీ సూర్యనారాయణ, టి.హరి నాగేంద్రనాథ్

తణుకు అర్బన్: ఇంటర్ ఫలితాల్లో మాంటిస్సోరీ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. ఫస్టియర్ బైపీసీలో ఎ.లావణ్య 435 మార్కులు, ఎంపీసీలో పీఎస్‌వీ సూర్యనారాయణ 464, టి.హరి నాగేంద్రనాథ్ 464, ఎం.అజన్య నిస్సి 463, జె.వైష్ణవి ప్రణీత 463 సాధించినట్లు వివరించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

సాంకేతికతలో రైతులకు సాయపడాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వ్యవసాయ రంగంలో అందివస్తున్న అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందుగా వ్యవసాయ అధికారులు అవగాహన చేసుకుని అనంతరం ఆ సాంకేతికతను రైతులకు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎంవీ శేషారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఒక ప్రైవేట్ అతిథి గృహంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమమే ప్రధాన కర్తవ్యంగా, వారి హక్కులను పరిరక్షించడం కోసమే తమ సంఘం పని చేస్తోందని స్పష్టం చేశారు. అసోసియేషన్‌కు సంబంధించి ఇటీవల ఖాళీ అయిన ప్రధాన కార్యదర్శి స్థానానికి జిల్లాలోని కొయ్యలగూడెంకు చెందిన బోడపూడి సోమశేఖర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాపయ్య నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన రంగనాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

పెంటపాడు: మత స్వేచ్ఛను హరించేలా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును తక్షణం రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, ఇతర సంఘాల ప్రతినిధులు కోరారు. శనివారం పెంటపాడు గేట్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులతో కలిసి కమ్యూనిస్టులు భారీ నిరసన చేపట్టారు. కార్యక్రమానికి ఆధ్వర్యం వహించిన కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ గుజరాత్ పెట్టుబడి దారులకు ప్రధాని అనుకూలంగా ఉండటం తగదన్నారు. వక్ఫ్ బిల్లు పట్ల ముస్లింలు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోరాటం హిందూ, ముస్లింల వివాదాలకు దారితీయకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. ముస్లిం సంఘ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు షేక్ హాసేన్ మాట్లాడుతూ మైనారిటీ హక్కుల కోసం చేస్తున్న ఈ నిరసనకు తప్పక కేంద్రం తలొగ్గాలన్నారు. ఈ చట్టాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సీపీఐ నాయకులు వంకా అప్పారావు, దిద్దే నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఓటు బ్యాంక్ కోసం బీజేపీ ప్రభుత్వం చిచ్చు పెట్టడం తగదన్నారు. షేక్ ఇస్మాయేల్, షేక్ బాజీ, షేక్ హుస్సేన్, మస్తాన్, రజియా, షహాదాబి, ఫాతిమాబీ, షేక్ లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు గేటు సెంటర్‌లో ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

క్లుప్తంగా

వేసవిలో దివ్యాంగులు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డి.సుష్మమాధురి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలు వేసవి కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పక తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక భవిత కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆరోగ్య కార్యకర్త డి.సుష్మమాధురి మాట్లాడుతూ వేసవిలో పిల్లలను ఆరుబయిట ఎండలో ఆటలాడనివ్వవద్దని, బయిటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి, కాటన్ దుస్తులు ధరించాలని, మజ్జిగ, నిమ్మరసం, వాటర్, పుచ్చకాయ, పండ్లు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ కూల్ డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వాసవిమాతకు విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వాసవి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పౌర్ణమి పురస్కరించుకొని వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శనివారం విశేష అభిషేకాలు జరిగాయి. పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, ఫల రసాలతో, పసుపు కుంకమలతో పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని రజిత చీరతో విశేష అలంకరణ చేశారు. సెక్రటరీ నున్నా బాల త్రిపుర సుందరరావు, ఆర్యవైశ్యులు పూరూరి కాశయ్య, ఆలపాటి వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



తణుకులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

తణుకు అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా పరీక్ష నిర్వహించారు. స్థానిక 3వ నంబరు మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 4వేలు, రెండో బహుమతిగా రూ. 2వేలు, మూడో బహుమతిగా రూ. వెయ్యి అందజేశారు. సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందుగా స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యువజన సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో చలివేంద్రం ప్రారంభం



కృష్ణాపురంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శనివారం మదర్ థెరిస్సా సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. టీడీపీ రూరల్ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దిపాటి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపకరిస్తాయన్నారు. మదర్ థెరిస్సా సభ్యులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ఫలితాలలో జీఎంఆర్ (గ్రంధి మాణిక్యాలరావు జూనియర్ కళాశాల) విజయకేతనం ఎగరవేసింది. జూనియర్ సీఈసీ విభాగంలో జి.షర్మిలా దీప్తి 485/500 టౌన్ సెకండ్ సాధించారు. సీనియర్ ఎంఈసీలో డి.మణికంఠారెడ్డి 950/1000 టౌన్ ఫస్ట్ సాధించారు. జూనియర్ బైపీసీలో బి.ప్రశాంతి 425, సీనియర్ బైపీసీలో ఆర్.జ్ఞాన ప్రసూనాంబ 952, సీనియర్ ఎంఈసీలో కె.అభి 933 మార్కులు సాధించారు. కళాశాల విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ వీవీఎస్ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్స్ వీఎస్ఎన్ శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ, అధ్యాపక బృందం విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.

శ్రీవాసవి విద్యార్థుల విశేష ప్రతిభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో శ్రీ వాసవి విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం 80 మంది విద్యార్థులకు గాను 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా రెండో సంవత్సరం 95 మంది విద్యార్థులకు గాను 81 మంది పాస్ అయ్యారు. దాసిరెడ్డి తులసి ప్రసన్న ఎంఈసీలో 926, కట్టుమోను భవాని సీఈసీలో 912, బత్తిన ఎస్‌వీవీ దుర్గ లక్ష్మి ఎంపీసీలో 901, గట్టి మహిమ జ్యోతి బైపీసీలో 738 మార్కులు సాధించారు. అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో మీసాల అనూష ఎంపీసీలో 434, కొప్పిశెట్టి దివ్యశ్రీ ఎంపీసీలో 433, గుర్రాల హారిక మాధవి దుర్గ సీఈసీలో 430లు సాధించారు.

ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రగతి విజయ భేరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రగతి విజయభేరి మ్రోగించింది. సీనియర్ ఎంపీసీలో సీహెచ్ అక్షయ్ 989, వీకేఎస్‌వీ ధరణి 978, జూనియర్ ఎంపీసీలో ఎ.విజయ్ 451, వీజీఎస్ కామాక్షి 444, సీనియర్ బైపీసీలో కె.లాస్యప్రియ 931, సీహెచ్‌వీ లక్ష్మి 912, జూనియర్ బైపీసీలో వై.లక్ష్మీదేవి 433, కె.మహిమారత్నం 428, సీనియర్ సీఈసీలో కె.నిహారిక దేవి సుభాషిణి 932, కె.పోసమ్మ 927, జూనియర్ సీఈసీలో వై.ధనశ్రీ 485, ఎం.ఎస్.గణేష్ 457 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు శ్రీప్రగతి విద్యా సంస్థలు చైర్మన్ కె.రమణయ్య (చంటి), సిబ్బంది అభినందనలు తెలిపారు.



తణుకులో ఇంటర్ ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించిన శశి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీవాసవీ యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన శశి..

తణుకు అర్బన్: ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో తణుకు శశి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నల్లూరి రాఘవేంద్రరావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను విద్యార్థిని చిలకలపల్లి శ్రీనిత్య 467 మార్కులు సాధించినట్లు చెప్పారు. గత 54 సంవత్సరాలుగా తణుకులో ఎవరూ సాధించలేని రికార్డు మార్కులను తమ విద్యార్థిని సొంతం చేసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు బాలనాగు ఫణిజోత్స్న 466, వాసా వెంకట దుర్గ అభినవ్ 466, కంచర్ల వెంకట దినేష్ 466, బి.నిహారిక సుష్మ 465, కె.రూపా తేజశ్వి 465, కె.సంజన 465, ఎం.శ్రీరామగుప్త 465, ఎం.తేజశ్వి నాగదుర్గ 465 మార్కులు సాధించినట్లు వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వెయ్యి మార్కులకుగాను రీసు దుర్గాలక్ష్మి 990, వై.హరిశంకర్ 990, బి.హరిణి శ్రీకృష్ణ 990, కె.చంద్రిక 990 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థిని శ్రీనిత్యకు రూ. 25వేలు, అభినవ్, దినేష్, సుష్మ, ఫణి జోత్స్నలకు రూ. 10వేలు చొప్పున కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ నగదు బహుమతులు అందచేశారు. సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, సంస్థ వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపాల్ వెలగల సత్యనారాయణ రెడ్డి, తణుకు క్యాంపస్ ఇన్‌చార్జ్ నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో శశి విద్యార్థుల ప్రభంజనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ఫలితాలలో శశి విద్యార్థులు ప్రభంజనం చాటారు. శశి సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ మేకా క్రాంతి సుధలు విద్యార్థులకు అభినందనలు చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 699 మంది విద్యార్థులకు 697 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యధికంగా 991 మార్కులతో పాటు 985 పైన మార్కులు 26 మందికి, 980 పైన మార్కులు 121 మందికి, 950పైన మార్కులు 388 మందికి 900 పైన మార్కులు 578 మందికి వచ్చాయి.

ఇంటర్‌లో ప్రగతి విద్యార్థుల ప్రతిభ

తణుకు అర్బన్: తల్లిదండ్రుల ఆశలు, కలలు నిలబట్టేందుకు ప్రతి విద్యార్థి ఇష్టంగా విద్యనభ్యసించాలని ప్రగతి జూనియర్ కళాశాల డైరెక్టర్ ప్రగతి రాజా అన్నారు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో విశ్రోతి కృషి సాయి, కాగిత పవన్ సాయి ఇద్దరూ కూడా 470 మార్కులకుగాను 465 మార్కులు సాధించి కళాశాల మొదటి స్థానంలో నిలిచారని, బైపీసీలో ఎండీ సానా 440 మార్కులకుగాను 435 మార్కులు సాధించినట్లు చెప్పారు. రెండో సంవత్సరంలో బొల్లా శ్యామసుందర సాయి వెయ్యి మార్కులకుగాను 987 మార్కులు సాధించారు.

ఆదిత్య విద్యార్థుల విజయకేతనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షలలో విజయకేతనం ఎగుర వేశారు. సీనియర్ ఇంటర్ విభాగంలో ఎంపీసీ విద్యార్థినీ షేక్ కుబ్రా యాస్మీన్ 991, ఎస్.చాందినీ లక్ష్మి సత్య 990, ఎం.బిందు మాధురి 989, కె.లీలా లోహిత్ 989 మార్కులు సాధించారు. బైపీసీలో టి.యామిని ప్రియ 989, జి.జ్యోతిశ్రీ 987, పి.ఎస్.నాగ నందిని కుమారి 985, సీఈసీ విభాగంలో ఏపీఎల్‌వీ రమణ 951 మార్కులు సాధించారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

14 నుంచి యాగర్లపల్లిలో వార్షిక సభలు

పెంటపాడు: ఈనెల 14 నుంచి రెండు రోజుల పాటు పడాల వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో యాగర్లపల్లిలో 12వ వార్షిక క్రీస్తు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు జిల్లా పాస్టర్లసంఘ నాయకులు కె. జాజిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలలో గుంటూరుకు చెందిన అంతర్జాతీయ ప్రసంగీకులు కొండవీటి బాబూరావు, పడాల వాక్యజ్యోతి చర్చి వ్యవస్థాపకురాలు కొమ్మిశెట్టి అమ్మాజీలు, పాస్టర్ కె. ఘనరాజు తదితరులు పాల్గొంటారన్నారు. ప్రతీరోజు సాయంత్రం 5.30 గంటలకు జరగబోయే ఈ సభలను విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యుపీఎఫ్ ప్రభు బల్లారాధన

పెంటపాడు: ఈనెల 14న గూడెం బాగ్యలక్ష్మీ పేట ఎల్ఎల్ఎం చర్చిలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యుపీఎఫ్) ప్రభు బల్లారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గూడెం, పెంటపాడు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం, మండలాల యుపీఎఫ్ సభ్యులంతా ఈ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు తప్పక పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విద్యకు ప్రభుత్వం కృషి

డీఈవో నారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. శనివారం మండలంలోని నవాబుపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో నారాయణ మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధీటుగా నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో ఉన్నత విద్యను అందజేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అందరి సమన్వయంతో డ్రాప్ అవుట్స్ లేకుండా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు చెప్పడంతో పాటు అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.హనుమ, గ్రామ నాయకులు మద్దుకూరి ధనరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(రూరల్): నవాబుపాలెం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో



పెంటపాడు: చిన్నారిని స్కూల్లో చేర్పుతున్న డీఈవో నారాయణ, ఎంఈవో టీవీఆర్కే

బడిఈడు పిల్లలను తప్పక ప్రభుత్వ బడిలో చేర్పాలి

పెంటపాడు: బడిఈడు పిల్లలను తప్పక ప్రభుత్వ బడిలో చేర్పాలని డీఈవో నారాయణ కోరారు. శనివారం ఆయన పెంటపాడు మండలం ప్రత్తిపాడు–1 పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. వేరే పాఠశాలలో డ్రాప్ బాక్స్ ఉన్న విద్యార్థులతో పాటు, అంగన్‌వాడీ స్కూల్లో 5 ఏళ్లు నిండిన విద్యార్థులను తప్పక బడిలో చేర్పాలన్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులతో నిత్యం ఉపాధ్యాయులు సంప్రదించాలన్నారు. ఎంఈవో టీవీ రామకృష్ణ, ఉపాధ్యాయిని ఇందిర తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ కిట్లు సకాలంలో అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ టీఎండీ ఇస్మాయిల్

అత్తిలి: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్లను నిర్ణీత సమయానికి పాఠశాలలకు చేరేవిధంగా పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌లు, ఐఈఆర్పీలు తమ వంతు బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ టీఎండీ ఇస్మాయిల్ చెప్పారు. శనివారం అత్తిలి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్–1 స్టాక్ పాయింట్‌ను స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్, జిల్లా సీఎంఓ వై చంద్రశేఖర్ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా స్టూడెంట్స్ కిట్‌లకు సంబంధించి సీఆర్ఎంటీ, పీటీఐ, ఐఈఆర్పీలతో సమావేశం నిర్వహించారు. స్టూడెంట్స్ కిట్‌లకు సంబంధించి విధివిధానాలను వివరించారు. ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించి కిట్లను ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీఎల్‌కే ప్రసాద్, ప్రధానోపాధ్యాయిని జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం విద్యుత్ ఫీడర్ మరమ్మతు పనులలో భాగంగా ఆదివారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఈఈ కె. నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజీపాడు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

కుట్రపూరిత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఆరిమిల్లి

అత్తిలి:మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విలేకరుల సమావేశంలో చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శనివారం అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా ఇటీవల అత్తిలిలో జరిగిన ఎంపీపీ ఎన్నిక ప్రక్రియలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విషపు సంస్కృతికి బీజం వేశారని దుయ్యబట్టారు. ప్రశాంత వాతావరణంలో జరిగే ఎంపీపీ ఎన్నికను కుట్రపూరితంగా అడ్డుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆయన మండిపడ్డారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రంభ సూరిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కుట్ర రాజకీయాలు ఇటీవల ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ఆయన వ్యవహరించిన తీరుతో బయటపడ్డాయన్నారు. బీసీ సెల్ తణుకు నియోజకవర్గ నాయకుడు కట్టా అప్పన్న మాట్లాడుతూ ప్రజా సేవ చేయడానికి ప్రజలు అధికారమిచ్చారని, అంతేగానీ కుట్రలు, కుతంత్రాలతో శాంతిభద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించాలని కాదని విమర్శించారు. ప్రశాంతంగా జరిగే ఎంపీపీ ఎన్నికను రాధాకృష్ణ కుట్రపూరితంగా వ్యవహరించి ఎన్నికను నిలుపుదల చేయించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు యాళ్ల స్వామి, సబ్బితి రాజేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, రాయుడు ధర్మారావు, యడ్లపల్లి గురు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

ఐటీడీపీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి

అత్తిలి: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డిపై అసభ్యకర పదజాలంతో దూషించిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై శనివారం అత్తిలి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం, ఆయన సతీమణి భారతిపై వ్యక్తిగతంగా, జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు రంభ సూరిబాబు, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, కట్టా అప్పన్న, కంకటాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్పిరిట్ క్లబ్ సేవలు అభినందనీయం



సర్టిఫికెట్స్ అందజేస్తున్న జిల్లా గవర్నర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్పిరిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎ.టెక్ కంప్యూటర్స్‌లో ఉచిత కంప్యూటర్ విద్యను పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబుచే సర్టిఫికెట్స్ అందజేశారు. డైరెక్టర్స్ నూకల నాగ మల్లేశ్వరరావు, జయ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదాశివస్వామి ఆలయ శంకుస్థాపన



శివాలయ శంకుస్థాపనలో హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రత్తిపాడు గ్రామం శనివారం శివనామ స్మరణతో మార్మోగింది. గ్రామంలో ఏలూరు కాలువను ఆనుకొని ఆరుగొలను రోడ్డులో నూతనంగా నిర్మించబోయే ప్రతిమాంబ సమేత సదాశివ స్వామి వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం, ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధనలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా శివదేవుని చిక్కాల, ప్రత్తిపాడు గ్రామాలకు చెందిన వేద పండితులు ర్యాలీ కృష్ణప్రసాద్, కూచి చంద్రమౌళిల ఆధ్వర్యంలో ఉదయం శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం ప్రత్యేక పూజలు హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వీర్ల కృష్ణ, సత్యవతి కుటుంసభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వీర్ల గోవింద్, వీర్ల ధనరాజు, వెంకటేష్ తదితరులతో పాటు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, వై. జంక్షన్ దుర్గమ్మ గుడి ఈవో యాళ్ల శ్రీధర్, రైస్‌మిల్లర్ సంఘ నాయకులు సామంతపూడి శ్రీరామరాజు, వెంకన్నబాబు, కొలనువాడ పెదకృష్ణంరాజు, బీసీ రాష్ట్ర సంఘ నాయకుడు లావేటి శ్రీనివాసరావు, టీబీఆర్ సంస్థల అధినేత తనబుద్ధి భోగేశ్వరరావు, గూడెంకు చెందిన పలువురు ప్రముఖులు, త్రిపుల్ ఎఫ్ కర్మాగార ప్రతినిధులు, గ్రామస్తులు, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. స్థానిక బార్ అసోసియేషన కార్యాలయంలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ గోదావరి జిల్లాల కమిటీ సమావేశం మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని, న్యాయవాదులకు రక్షణ లేదన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, కోర్టు సిబ్బందిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, జిల్లా సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు, వై.మణికంఠ తేజ, బాబా, సత్యనారాయణ, విజయభాస్కర్‌రావు, వెంకట్, లక్ష్మి, రాజారావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేకా ఈశ్వరయ్య